సాక్షి బాపట్ల

బుధవారం ׀ 6 ׀ ఆగస్టు ׀ 2025



కుంకుమ పూజలు

భట్టిప్రోలు: స్థానిక పరంజ్యోతి అమ్మ భగవాన్ మందిరంలో మంగళవారం శ్రీ లక్ష్మీ అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. వేల్పూరి శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు.



వెల్లటూరులో సంకీర్తనలు

భట్టిప్రోలు: వెల్లటూరులోని గీతా మందిరంలో మంగళవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వివిధ సమాజాలతో భజన సంకీర్తనలు నిర్వహించారు.



రేషన్ బియ్యం స్వాధీనం

తాడికొండ: మండలంలోని రాయపూడి గ్రామంలో 23బస్తాల రేషన్‌బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారంరాత్రి శివాలయం సమీపంలో ఎస్‌ఐ కలగయ్య వీటిని పట్టుకున్నారు.

న్యూస్‌రీల్

ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి



మేదరమెట్ల: కొరిశపాడులో రూ.1.66 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం ప్రారంభించారు. స్థానిక దండు రామకృష్ణారెడ్డి హైస్కూల్‌లో గల విద్యార్థినులకు 56 సైకిళ్లను పంపిణీ చేశారు. దివ్యాంగులు 15 మందికి ట్రై స్కూటీలను ఉచితంగా అందజేశారు. గ్రామంలో సీసీ రోడ్లు.. డ్రైనేజీ, గ్రావెల్ లింక్‌రోడ్డు నిర్మాణాలకు గాను రూ.2.30 కోట్లు పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ వెంకటమురళి, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఐపీఎస్‌కు ఎంపికైన దోనేపూడి విజయ్‌బాబు



తెనాలి: పట్టణానికి చెందిన దోనేపూడి విజయ్‌బాబు ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. 2024 సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన అభ్యర్థులకు సర్వీస్‌లను కేటాయిస్తూ యూపీఎస్‌ఈ మంగళవారం తుది ఫలితాలను విడుదల చేసింది. 2021 సివిల్స్ పరీక్షల్లో తొలి ప్రయత్నంలోనే ఐఆర్‌ఎస్‌కు ఎంపికైన విజయ్‌బాబు, ప్రస్తుతం విజయవాడలో ఆదాయపు పన్ను శాఖలో అసిస్టెంట్ కమిషనర్ (ఇన్వెస్టిగేషన్స్) బాధ్యతల్లో ఉన్నారు. ఐఏఎస్‌కు ఎంపిక కావాలన్న లక్ష్యం కోసం వరుసగా సివిల్స్ పరీక్షలు రాస్తూ వచ్చారు. నాలుగో పర్యాయం 681 ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. అయినప్పటికీ తనకు సంతృప్తి లేదన్నారు. విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి అయిన తన తండ్రి దోనేపూడి మధుబాబు కోరిక ప్రకారం ఐఏఎస్ అధికారి కావాలన్నదే తన కలగా విజయ్‌బాబు చెప్పారు. అందుకోసం మరోసారి సివిల్స్ రాస్తానని తెలిపారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన



మంగళగిరి/ మంగళగిరి టౌన్: ఈ నెల 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆటోనగర్‌లో ఉన్న వీవర్స్‌శాలను ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ,ఎమ్మెల్సీ పెందుర్తి వెంకటేశ్వరరావు, సబ్ కలెక్టర్ ఎ. భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్వరరావు, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, మంగళగిరి తహసీల్దార్ దినేష్‌రాఘవేంద్రలు ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం ప్రయాణించే మార్గాలు, వాహనాల పార్కింగ్, వీవర్‌శాల సందర్శన, చేనేత కుటుంబాలతో సమావేశమయ్యే ప్రజావేదిక వద్ద అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు.

13 నుంచి అమరేశ్వరుని పవిత్రోత్సవాలు



అమరావతి: ప్రసిద్ధ శైవ క్షేత్రం అమరావతి అమరేశ్వరాలయంలో 13వ తేదీ బుధవారం నుంచి పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా ప్రారంభిస్తామని ఆలయ ఈఓ రేఖ మంగళవారం తెలిపారు. యార్లగడ్డ ఉపేంద్ర, విజయలక్ష్మి దంపతుల నేతృత్వంలో మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నామన్నారు. మొదటి రోజు వేదపండితులచే ఉదక శాంతి, ఆలయ శుద్ధి, ప్రధాన ఉపాలయాల మూర్తులకు స్నపనాభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారన్నారు. రెండోరోజు గురువారం మండప పూజలు, దీక్షా హోమాలు, మూలమంత్ర హవనములు, రుద్రహోమం, పవిత్రారోపణం , చండీహోమం మూడవరోజు శుక్రవారం ప్రాయశ్చిత్త హోమం, పూర్ణాహుతి, మహదాశీర్వచనం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

గ్రానైట్ క్వారీల్లో అక్రమ పేలుళ్లు

బిల్లులు లేకుండానే యథేచ్ఛగా ఎక్స్‌ప్లోజర్స్ విక్రయం



- పచ్చనేతల కనుసన్నల్లో లైసెన్స్ హోల్డర్ల అక్రమ వ్యాపారాలు
- భద్రతను పట్టించుకోని వైనం
- కూటమి పాలనలో కానరాని తనిఖీలు
- నెల మామూళ్లతో సరిపెట్టుకుంటున్న అధికారులు
- హైదరాబాద్, నాగపూర్ నుంచి పేలుడు పదార్థాల దిగుమతి



సాక్షి ప్రతినిధి,బాపట్ల: పేలుడు పదార్థాలు జిల్లాకు పెద్దఎత్తున తరలి వస్తున్నాయి. వాటిలో చాలా వరకు ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమ పద్ధతిలో దిగుమతి అవుతున్నాయి. బల్లికురవ, సంతమాగులూరు, గురిజేపల్లి ప్రాంతాల్లోని గ్రానైట్ క్వారీల్లో పేలుళ్ల కోసం వీటిని వినియోగిస్తున్నారు. ఈ పేలుడు పదార్థాలను హైదరాబాద్‌లోని కొన్ని ఎక్స్‌ప్లోజర్స్ కంపెనీల నుంచే కాకుండా నాగపూర్, చైన్నైల నుంచి ఇక్కడికి తరలిస్తున్నారు. చీమకుర్తి, బల్లికురవ ప్రాంతాలకు చెందిన కొందరు లైసెన్స్ హోల్డర్లు అక్రమ పద్ధతిలో ఎక్స్‌ప్లోజర్స్‌ను దిగుమతి చేసుకొని ఈ ప్రాంతంలోని క్వారీల యజమానులకు విక్రయిస్తున్నారు. బిల్లులు లేకుండా ఎక్స్‌ప్లోజర్స్ దొరుకుతుండడంతో క్వారీ యజమానులు వీలైనంత ఎక్కువగా పేలుడు పదార్థాలు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఆదివారం బల్లికురవ మండలం కొనెదన రెవెన్యూ పరిధిలోని సత్యకృష్ణ గ్రానైట్ క్వారీలో ప్రమాదం సంభవించి పలువురు ఒడిశాకు చెందిన కార్మికులు మృతి చెందిన నేపథ్యంలో గ్రానైట్ క్వారీల్లో ప్రమాదాలపై మరోమారు చర్చ సాగుతోంది. పేలుడు, డ్రిల్లింగ్‌ల సందర్భంలో క్వారీల్లో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అయితే క్వారీ యజమానులు భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు.

చీమకుర్తి కేంద్రంగా అక్రమ వ్యాపారం

చీమకుర్తి కేంద్రంగా పేలుడు పదార్థాల వ్యాపారం నడిపిస్తున్న త్రినాథరావుకి 21తోపాటు 22 (లీజుకు తీసుకున్నది) లైసెన్స్‌లు ఉండగా ఈయన మొత్తం ఎక్స్‌ప్లోజర్స్ మూడు జిల్లాల్లో వ్యాపారానికి కింగ్ పిన్‌గా ఉన్నారు. ఈ వ్యక్తి చీమకుర్తి ప్రాంతంలో గోదాములు ఏర్పాటు చేసుకొని బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు బిల్లులు లేకుండానే పేలుడు పదార్థాలు సరఫరా చేస్తున్నారు. కొందరు ఎక్స్‌ప్లోజర్స్ లైసెన్స్‌దారులు ఈ వ్యక్తి పేరు మీదనే ఇండెంట్ పెట్టుకుని పేలుడు పదార్థాలు తెప్పించుకుంటున్నారు. ఈ వ్యాపారి సరఫరా చేసే ఎక్స్‌ప్లోజర్స్‌లో 80 శాతం వాటికి బిల్లులు లేకుండా విక్రయాలు సాగిస్తున్నట్లు సమాచారం.

పచ్చపార్టీ నేతల అండదండలతో...

బల్లికురవ ప్రాంతం నాగరాజుపల్లెకు చెందిన హరిప్రసాద్‌బాబు గంగపాలెం ప్రాంతంలో గోదాము ఏర్పాటుచేసి అక్రమ ఎక్స్‌ప్లోజర్స్ విక్రయిస్తున్నారు. సదరు వ్యాపారికి చీమకుర్తి, బల్లికురవ ప్రాంతాల్లో గోదాములు ఉండగా నెల్లూరు కేంద్రంగా కూడా వ్యాపారం సాగిస్తున్నట్లు సమాచారం. ఇదే గ్రామానికి చెందిన రాజేష్‌కుమార్ 20 వరకూ క్వారీలతోపాటు 18 టన్నుల గోదాములతో ఎక్స్‌ప్లోజర్స్‌ను పెద్దఎత్తున విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. మార్టూరుకు చెందిన మల్లి వలపర్ల ప్రాంతంలో గోదాము ఏర్పాటు చేసుకొని పేలుడు పదార్థాలు అక్రమంగా విక్రయిస్తున్నాడు. రామాంజిపురానికి చెందిన హనుమంతు రామాంజిపురం ప్రాంతంలో 4 టన్నుల గోదాము, నాగరాజుపల్లి ప్రాంతంలో మూడు టన్నుల గోదాము ఏర్పాటు చేసి పేలుడు పదార్థాల వ్యాపారం సాగిస్తున్నట్లు సమాచారం. ఇక్కడి పేలుడు పదార్థాల లైసెన్స్‌దారులు చాలా మంది పచ్చపార్టీ అండతో అక్రమ పద్ధతిలోనే విక్రయాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. వీరంతా దాదాపు డీ గార్డ్, డీ ఎఫ్, కేబుల్, వైరులో పాడి, తూటా(జలబాక్స్) 180, 200 మాటర్లు, బూస్టర్లు, ఈడీ(జిలెటిన్ స్టిక్స్), ఓడీ తదితర పేలుడు పదార్థాలను క్వారీలలో పేలుళ్ల కోసం విక్రయిస్తున్నారు. ఎక్స్‌ప్లోజర్స్‌ను హైదరాబాద్, నాగపూర్, చైన్నై ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. కొందరు వ్యాపారులు నిషేధిత పేలుడు పదార్థాలను సైతం తెచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం.

వ్యాపారులకు అధికారులు అండ

కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చాక క్వారీల్లోని పేలుళ్లు, పేలుడు పదార్థాల విక్రయాలు, వినియోగాన్ని అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. క్వారీ యజమానులతోపాటు పేలుడు పదార్థాల విక్రయదారులు దాదాపుగా పచ్చపార్టీ నేతలు, మద్దతుదారులే కావడం, కొందరు మైనింగ్, పోలీసు, విజిలెన్స్, ఫైర్ అధికారులు వారి వద్ద నెల మామూళ్లు పుచ్చుకొని పేలుడు పదార్థాల గురించి పట్టించుకోవడంలేదు. వ్యాపారులు చూపిన రికార్డులపై గుడ్డిగా సంతకాలు పెడుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

హైదరాబాద్, నాగపూర్, చైన్నై ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్న పేలుడు పదార్థాలను అనధికారికంగా గ్రానైట్ క్వారీల్లో పేలుళ్ల కోసం విక్రయిస్తున్నారు. ఇది ప్రమాదమని తెలిసినా వ్యాపారులు ఖాతరు చేయడం లేదు. పేలుడు పదార్థాల విక్రయాలకు నియంత్రణ అవసరం. అనధికారికంగా కాకుండా అధికారిక (బిల్లులతో) విక్రయాలు మాత్రమే జరిగేలా చూడాలే తప్ప ఎక్స్‌ప్లోజర్స్ వినియోగానికి మినహాయింపులు ఉండకూడదు. అధికారుల నిఘా మధ్య ఎక్స్‌ప్లోజర్స్ వినియోగం వుండాలి. ఇప్పటికైనా మైనింగ్‌తోపాటు జిల్లా ఉన్నతాధికారులు పేలుడు పదార్థాల వినియోగంపై దృష్టి పెట్టి అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలకు దిగాలి.

సెల్‌ఫోన్‌లు పనిచేయడం లేదంటూ నిరసన



కొరిశపాడు సీడీపీవో ఆఫీసు ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

మేదరమెట్ల: ప్రభుత్వం తమకు ఇచ్చిన సెల్‌ఫోన్‌లు సక్రమంగా పనిచేయడంలేదంటూ అంగన్‌వాడీలు కొరిశపాడు సీడీపీఓ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గుంటుపల్లి శారద మాట్లాడుతూ గవర్నమెంట్ వారు ఇచ్చిన సెల్‌ఫోన్లు పనిచేయడంలేదని, రెండు యాప్‌లలో గర్భిణులు, బాలింతల ఫేస్ అప్‌లోడ్ చేయాలని.. అయితే ఆఫోన్లలో ఫేస్ అప్‌లోడ్ కావడంలేదన్నారు. పనిచేయని ఫోన్లు తమకు వద్దంటూ సీడీపీవో కృష్ణకుమారికి సెల్ ఫోన్‌లను తిరిగి అందజేశారు.

వేటపాలెం: ప్రభుత్వ 2జీ ఫోన్లకు ఇచ్చి 5జీ ఉండే పనులను చేయమంటే ఎలా అని.. నాణ్యత లేని సెల్‌ఫోన్లు మాకొద్దు అంటూ మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ముందు అంగన్‌వాడీ వర్కర్లు నిరసన తెలిపారు. ఫోన్లను సూపర్‌వైజర్లకు అందజేశారు. పోషణ్ ట్రాకర్, బాల సంజీవిని యాప్స్ రాక ఇబ్బంది పడుతన్నామని తెలిపారు. గర్భిణులు, బాలింతల, 0–5 ఏళ్ల పిల్లల సమాచారం, ఫొటోలు, ఓటీపీ రావాలని.. ఐసీడీఎస్ అధికారులు ఒత్తిడి చేస్తుండటంతో ఫోన్లను వెనక్కి ఇచ్చి నట్లు చెప్పారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు ప్రమీల, బ్యూల, సీఐటీయూ నాయకులు ఎం .వసంతరావు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రూ.5 లక్షలు గ్రాట్యుటీ ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్‌చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. పద్మ, భూలక్ష్మి, జ్యోతి, ఆదిలక్ష్మి, నిర్మల, పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రభుత్వానికి స్మార్ట్ మీటర్ల గండం

శాసనమండలి మాజీ సభ్యుడు జల్లి విల్సన్



నిరసన తెలియజేస్తున్న వివిధ ప్రజా సంఘాల నాయకులు

అద్దంకి: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వానికి స్మార్టు మీటర్ల గండం పొంచి ఉందని మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్ అన్నారు. 2001 విద్యుత్ పోరాట చరిత్ర చంద్రబాబు మర్చిపోవద్దని గుర్తు చేశారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మంగళవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో నిరసన నిర్వహించారు. సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విల్సన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగులగొట్టాలని పిలుపునిచ్చిన లోకేష్ నేడు భిన్నంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. నరేంద్ర మోదీ అండతో అదానీ దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలను దోచుకునే విధంగా విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రతి కుటుంబం నుంచి రూ.17,000లతో పాటు పీక్ అవర్స్ పేరుతో అధిక చార్జీలను గుంజే విధానాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని తంగిరాల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈపాటికే బిగించిన స్మార్ట్ మీటర్లతో చిన్న వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారని, చిన్న పరిశ్రమలు మూతపడితే.. ఉపాధి రంగంపై తీవ్ర ప్రభావం పడనుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ నాయకులు కె.ఎల్డి ప్రసాద్, ఖాదర్ బాషా, సీఐటీయూ నాయకులు తిరుపతిరెడ్డి, పట్టణ పౌర సంఘ నాయకులు బి.విజయ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో కరీం, ఆదాము, నాగేశ్వరావు, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, సామియేల్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ట్రాక్టర్ బీభత్సం

- మహిళపై నుంచి వెళ్లిన ట్రాక్టర్
- మద్యం మత్తులో నడపడం వల్లే ప్రమాదం
- నలుగురికి గాయాలు
- మహిళ పరిస్థితి విషమం



గోడను ఢీకొట్టడంతో ఆగిన ట్రాక్టర్



చెల్లాచెదురైన బజ్జీల బండి

నగరం నగరం మెయిన్ సెంటర్‌లో మంగళవారం సాయంత్రం ట్రాక్టర్ బీభత్సం సృష్టించింది. నగరం గ్రామానికి చెందిన తాడివాక జయప్రద (45)రోడ్డుపై వెళుతున్న సమయంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ (ఏపీ 27 టీ 7895) అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో జయప్రద ఎగిరి కిందపడింది. ఆమెపై నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో తీవ్ర గాయాలపాలైంది. అంతంటితో ఆగకుండా ఎదురుగా ఉన్న బజ్జీల బండిని ఢీ కొంది. దీంతో బండి చెల్లాచెదురుగా పడింది. అనంతరం పక్కనే ఉన్న గోడను ఢీకొట్టి ట్రాక్టర్ ఆగింది. ఈ ఘటనలో బజ్జీ బండి నిర్వాహకుడు గాయాలపాలయ్యారు. వీరితోపాటు ట్రాక్టర్ డ్రైవర్‌కు కాలు విరిగింది. ట్రాక్టర్ పైన ఉన్న మరో వ్యక్తికి గాయాలయ్యాయి. తీవ్ర గాయాలపాలైన జయప్రదను స్థానికులు ప్రభుత్వ వైద్యశాల తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. ఘటనపై ఎస్‌ఐ భార్గవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మద్యం మత్తులో ట్రాక్టర్ నడపడం వల్ల ప్రమాదం సంభవించిందని స్థానికులు వెల్లడించారు.



ప్రమాదంలో గాయపడిన మహిళను వైద్యశాలకు తరలిస్తున్న స్థానికులు

ఈదుపల్లికి విష జ్వరం

- రెండు రోజుల్లోనే భార్యాభర్తలు మృతి
- అనాథలుగా మిగిలిన ఇద్దరు కుమార్తెలు
- కదిలిన పాలకులు, అధికార యంత్రాంగం
- ఇంటింటి సర్వే చేపట్టిన వైద్య సిబ్బంది
- గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు



నగరం సామాజిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

నగరం: నగరం మండలం ఈదుపల్లి గ్రామానికి విషజర్వం సోకింది. రెండు రోజుల వ్యవధిలోనే ఇద్దరు మృతి చెందారు. పలువురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో పాలకులు, అధికారులు స్పందించారు. సోమవారం రాత్రి జిల్లా వైద్యధికారిణి విజయమ్మ ఈదుపల్లి గ్రామంలో పర్యటించారు. మంగళవారం వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టారు. పంచాయతీ సిబ్బంది ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈదుపల్లి గ్రామంలో నెల రోజుల నుంచి విష జర్వాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులుగాని, అధికారులు గాని స్పందించలేదు. రెండు రోజుల్లోనే ఒకే కుటుంబానికి చెందిన భార్యాభర్తలు తుమ్మల సుబ్బారావు, మహాలక్ష్మి ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలారు. సరైన సమయంలో వైద్య సిబ్బందిగాని, పంచాయతీ అధికారులు గాని స్పందించి ఉంటే ప్రాణ నష్టం జరిగి ఉండేది కాదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఈదుపల్లిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న సిబ్బంది

గ్రామంలో పర్యటించిన జిల్లా కలెక్టర్

ఈదుపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి మంగళవారం పర్యటించారు. గ్రామంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక వైద్య శిబిరాలు, పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామంలో మురుగు నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జర్వాలు తగ్గుముఖం పట్టే వరకు గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరాలు కొనసాగించాలన్నారు. అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండి జర్వాలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యసేవలు అందజేయాలని సూచించారు.

ఇంటింటి సర్వే

ఈదుపల్లి గ్రామంలో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. 450 కుటుంబాలలో సర్వే నిర్వహించగా 56 మందికి జర్వాలు ఉన్నట్లు గుర్తించారు. వీరికి డెంగీ పరీక్ష నిర్ధారణ కోసం శాంపిల్లు సేకరించి పరీక్షల నిమిత్తం పంపించినట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు.

విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ వెంకట మురళి



ఈదుపల్లిలో గ్రామస్తులను నుంచి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటమురళి

నగరం: విషజర్వాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జే వెంకటమురళి ప్రజలకు సూచించారు. మండలంలోని ఈదుపల్లి గ్రామంలో మంగళవారం పర్యటించి పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. ఈదుపల్లి గ్రామంలో విష జ్వరాలు ఉండటంతో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించినట్లు తెలిపారు. సర్వేలో 56మందికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. మృతి చెందిన మహలక్ష్మికి మాత్రమే డెంగీ లక్షణాలు ఉన్నాయని, ఆమె భర్త అనారోగ్య సమస్యలతో మృతి చెందినట్లు తేలిందన్నారు. వైరల్ ఫీవర్లు వచ్చిన వారు ఆర్‌ఎంపీల వద్ద చికిత్స చేయించుకోవడం మంచిది కాదన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందాలన్నారు. ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని రోజుల తరబడి రోగులకు చికిత్స చేయకూడదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహాలక్ష్మికి డెంగీ వచ్చినట్లు గుర్తించకపోవడం వల్ల ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. గ్రామంలో విషజ్వరాలు అదుపులోకి వచ్చేంత వరకు వైద్య శిబిరాలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామస్తులు తాగునీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. 15 రోజులలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి, డీఎంహెచ్‌ఎం డాక్టర్ విజయమ్మ, డీఎల్‌డీవో పద్మ, డెప్యూటీ సీఈవో కృష్ణ, తహసీల్దార్ నాంచారయ్య, ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ట్రైబల్ ఫొటో అవార్డులకు ఎంపిక



కేసానుపల్లి సుబ్బారావు తీసిన వాటర్ క్యారీ ఫొటో

వినుకొండ: అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవాల సందర్భంగా క్రియేటివ్ కల్చర్ కమిషన్ గవర్నమెంట్ ఆఫ్ ఏపీ, ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటో కాంటెస్ట్‌లో వినుకొండకు చెందిన ఫొటోగ్రాఫర్లకు ట్రైబల్ ఫొటో ఆఫ్ ది ఇయర్ అవార్డు లభించింది. వినుకొండకు చెందిన వంగపల్లి బ్రహ్మయ్య తీసిన హ్యాపీనెస్, కేసానుపల్లి సుబ్బారావు తీసిన వాటర్ క్యారీ ఫొటోలు అవార్డులకు ఎంపికయ్యాయి.



వంగపల్లి బ్రహ్మయ్య తీసిన హ్యాపీనెస్ ఫొటో

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,500 గరిష్ఠం : రూ. 2,300

మోడల్ ధర రూ. 1,900

మిర్చి

యార్డు సమాచారం

(మంగళవారం ధరలు)



వచ్చిన బస్తాలు	54,912
అమ్మకాలు	53,097
నిల్వ	8,514

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,500
నంబరు-5	10,000-13,300
341	10,000-14,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-12,800
నంబరు-5	10,000-13,400
341	10,000-14,800
4848	10,000-12,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,000
బాడిగ-355	10,000 - 12,600
దేవనూరు డీలక్స్	10,000 - 12,500
ఆర్మూర్	9,800 - 11,000
తాలుకాయలు	5,000 - 7,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-13,800
బాడిగ - 355	10,000-12,200
దేవనూరు డీలక్స్	10,000 - 12,400
తాలు	5,300 - 7,000

-కొరిటిపాడు (గుంటూరు)



పసుపు ధరలు

(మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 676

కొమ్ములు : 506 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,700	10,600	10,100

కాయలు : 170 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,800	10,600	10,200

మొత్తం అమ్మకాలు : 507.00 క్వింటాళ్లు

-దుగ్గిరాల

ఏం లేదుగా.. అంతా బాగానే ఉందిగా..

డ్వామా అక్రమాలపై వినూత్నంగా విచారణ

- తలుపులు వేసి బెదిరింపులు
- నోరుమెదపక పోయినా ఓకే రాసుకొన్న క్వాలిటీ కంట్రోల్ అధికారి
- అక్రమాలు కప్పిపెట్టేందుకు యత్నం
- బాపట్లలో విచారణ జరపాలన్న కమిషనర్
- చీరాల ఎంపీడీవో కార్యాలయానికి విచారణ బదిలీ
- కెపాసిటి బిల్డింగ్‌పై విచారణంటూ వెల్ఫేర్ గ్రూపులో మెసేజ్
- ఏపీవోలు మాత్రమే రావాలంటూ డ్వామా పీడీ అనుచరుల మెసేజ్



సాక్షి ప్రతినిధి.బాపట్ల: డ్వామా అక్రమాలపై పంచాయతీరాజ్ కమిషనరేట్ చేపట్టిన విచారణ వినూత్నరీతిలో సాగడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటువంటి సరికొత్త పద్ధతిలో విచారణ గతంలో ఎన్నడూ జరగలేదని డ్వామా ఉద్యోగులు, సిబ్బంది వ్యాఖ్యానిస్తున్నారు. జిల్లా ఉపాధి హామీ పనుల్లో పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఫేక్ మస్టర్లు, పనులు చేయకుండానే డబ్బులు డ్రా చేయడం, గత ప్రభుత్వంలో జరిగిన పనులు చూపి బిల్లులు చేసుకోవడం వ్యవహారాలపై 'సాక్షి' పలు కథనాలు ప్రచురించిన విషయం విదితమే. దీనికి స్పందించిన పంచాయతీరాజ్ కమిషనర్ బాపట్ల జిల్లాలో ఉపాధి హామీ పనుల్లో జరుగుతున్న అక్రమాలతోపాటు డ్వామా పీడీ అక్రమాలపైనా విచారణకు ఆదేశించినట్లు సమాచారం. ఇక్కడి నుంచే కొత్త కథ మొదలైంది. కమిషనరేట్ విచారణ విషయాన్ని ఇక్కడి డ్వామా పీడీకి చేరవేసిన క్వాలిటీ కంట్రోల్ అధికారి స్వయంగా విచారణాధికారిగా రావడంతో అసలు కథ రక్తికట్టింది. బాపట్ల జిల్లా డ్వామా కార్యాలయంలో జరగాల్సిన విచారణను డ్వామా పీడీ ఆదేశాల మేరకు సదరు అధికారి చీరాల ఎంపీడీవో కార్యాలయానికి బదిలీ చేశారు. అక్రమాలపై విచారణ అనే విషయాన్ని కప్పిపెట్టి కెపాసిటీ బిల్డింగ్‌పై సమావేశమని ప్రచారం చేశారు. డ్వామాలో అక్రమాలకు దన్నుగా ఉన్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక ఏపీవో కెపాసిటీ బిల్డింగ్‌పై విచారణ అంటూ డ్వామా ఉద్యోగుల వెల్ఫేర్ గ్రూపులో పోస్టుచేశారు. వాస్తవానికి కెపాసిటీ బిల్డింగ్‌పై సమావేశం అయితే ఆ కోర్సు డైరెక్టర్, క్లస్టర్ ఏపీడీవోలతోపాటు అన్ని విభాగాల ఉద్యోగులు సమావేశంలో పాల్గొనాల్సి వుంటుంది. కానీ ఈ సమావేశానికి ఏపీవోలు మాత్రమే రావాలని సదరు ఏపీవో మెసేజ్ పెట్టారు. కేవలం ఏపీవోలను పిలిపించి ఇబ్బంది కలుగకుండా విచారణ తంతును ముగించాలన్నది క్వాలిటీ కంట్రోల్ అధికారి, డ్వామా పీడీలు కలిసి పన్నిన వ్యూహంగా ప్రచారం. ఈ మేరకు గత నెల 18న ఉదయం బాపట్లలో కాకుండా చీరాల ఎంపీడీవో కార్యాలయంలో కెపాసిటీ బిల్డింగ్‌పై సమావేశం పేరుతో అక్రమాలపై విచారణ మొదలు పెట్టారు. సమావేశానికి హాజరయ్యే వరకూ ఉపాధి అక్రమాలు, డ్వామా పీడీపై విచారణ అనే విషయాన్ని గోప్యంగా ఉంచారు. సమావేశానికి వచ్చిన ఏపీవోలు ఎంపీడీవో కార్యాలయంలోకి రాగానే తలుపులు మూసేశారు. వాస్తవానికి అక్రమాలపై విచారణ అయితే ఒక్కొక్కరినీ పిలిచి సీక్రెట్‌గా విచారిస్తారు. పిలిచిన వారి అభిప్రాయాన్ని పర్సనల్‌గా తీసుకుంటారు. కానీ ఇక్కడ విచారణ అందుకు భిన్నంగా జరిగింది. 'ఏం లేదు..ఏం లేదుగా.. అంతా బాగానే ఉందిగా' అనే ఊతపదంతో క్వాలిటీ కంట్రోల్ అధికారి ఏపీవోల అభిప్రాయాన్ని తీసుకోకుండానే వారి పేర్లు రాసుకొని అక్రమాలు జరగలేదని ఎస్ చెప్పినట్లుగా రాసుకున్నట్లు పలువురు ఏపీవోలు తెలిపారు. కొందరు విచారణ అని తెలుసుకున్నా.. ఒక్కొక్కరు కాకుండా అందరినీ ఒకే దగ్గర కూర్చోబెట్టడంతో అక్రమాలపై చెప్పలేకపోయామని, పైగా డ్వామా పీడీకి అనుకూలంగా ఉన్న కొందరు ఏపీవోలు మిగిలిన వారు ఏమీ చెప్పకుండా క్వాలిటీ కంట్రోల్ అధికారిని అంటిపెట్టుకొని ఉన్నారని చెప్పారు. కొందరు సాహసం చేసి చెప్పాలనుకున్నా.. ఏపీవోలకు అవకాశం ఇవ్వకుండా అంతా రాసుకున్నా .. మీరు చెప్పనక్కరలేదంటూ క్వాలిటీ అధికారి దాటవేసినట్లు తెలుస్తోంది.

మొత్తంగా ఉపాధి అక్రమాలు, అవినీతిపై క్వాలిటీ కంట్రోల్ అధికారి ఏపీవోలను మాట్లాడించకుండానే తనదైన శైలిలో విచారణ తంతు ముగించినట్లు పలువురు ఏపీవోలు సాక్షికి తెలిపారు. విచారణ అధికారిగా వచ్చిన క్వాలిటీ కంట్రోల్ అధికారికి తోడుగా విజిలెన్స్ నుంచి విచారణలో పాల్గొన్న మరో అధికారి ఈ తంతును గమనించి మిన్నకుండిపోయినట్లు పలువురు తెలిపారు. విచారణలో తలుపులు వేయడం గమనించిన స్థానిక అధికారి ఫొటోలు తీయించగా అదిగమనించిన విచారణాధికారి ఆ ఫొటోలు డిలీట్ చేయించారు. మొత్తంగా జిల్లాలో పెద్దఎత్తున జరుగుతున్న అక్రమాలను కప్పిపుచ్చేందుకు క్వాలిటీ కంట్రోల్ అధికారి వినూత్న రీతిలో చేపట్టిన విచారణ తీరుపట్ల సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. అక్రమాలను అరికట్టి ప్రజాధనం సద్వినియోగం అయ్యేలా చూడాల్సిన అధికారి అక్రమాలకు దన్నుగా నిలవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విచారణ వ్యవహారంపై కొందరు ఇప్పటికే పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

తల్లి పాలు శిశువు ఆరోగ్యానికి అత్యంత ముఖ్యం

సీడీపీవో సుచిత్ర



రేపల్లె కార్యాలయంలో సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న సీడీపీవో సుచిత్ర

రేపల్లె: తల్లి పాలు శిశువు ఆరోగ్యానికి అత్యంత ముఖ్యమైనవని సీడీపీవో ఎం.సుచిత్ర పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బిడ్డ జన్మించిన వెంటనే తల్లి అరగంట సమయంలోపే ముర్రుపాలు పట్టించాలని సూచించారు. తద్వారా బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి మెండుగా ఉంటుందని చెప్పారు. తల్లులు తమ పాలను మాత్రమే బిడ్డకు పట్టించాలని, డబ్బా పాలు పట్టించి అనారోగ్యం పాలు చేయరాదని సూచించారు. బిడ్డకు పాలు ఇవ్వటంతో తల్లి, బిడ్డలు ఇరువురు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. అనంతరం పలువురు గర్భిణులకు సీమంతం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు ఎస్.కె నాతిక్, ఎస్.కె షాహీన్, సూపర్‌వైజర్‌లు హిమబిందు, రాధిక, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, సహాయకులు గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై ఆన్‌లైన్ పనిభారం తగ్గించాలి



యూటీఎఫ్ సభ్యత్వం స్వీకరిస్తున్న ఉపాధ్యాయులు

నిజాంపట్నం: ఉపాధ్యాయులపై ఆన్‌లైన్ పనిభారం తగ్గించాలని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సీహెచ్.బాపయ్య డిమాండ్ చేశారు.. నిజాంపట్నంలో మంగళవారం యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ నిరంతరం ముందు ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు యూటీఎఫ్ సభ్యత్వం తీసుకొని సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులు ఐక్యంగా పోరాటాలకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పీఆర్సీ కమిటీలను నియమించాలన్నారు. ఉపాధ్యాయులకు పెండింగ్ ఉన్న డీఏ, ఐఆర్‌లను వెంటనే ప్రకటించాలని కోరారు. గత విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కుల సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నిజాంపట్నం మండల అధ్యక్షులు వై శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి హుస్సేన్, నాయకులు గణేష్ రావు, నాగరాజు, కుమార్, హరిబాబు, ఏడుకొండలరావు, రాజభూషణం, రామకృష్ణ, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆలోచన మానుకోండి

- సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్.మణిలాల్
- విద్యుత్ కార్యాలయం వద్ద వామపక్షాల ధర్నా



ఏడీఈ శ్యామ్‌సుధాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

రేపల్లె: విద్యుత్ చార్జీల భారాలను వెంటనే తగ్గించడంతోపాటు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను రద్దు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్.మణిలాల్ డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆలోచన ఉపసంహరించుకోవాలని, ఇప్పటికే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఇసుకపల్లిలోని విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత మీటర్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపారని విమర్శించారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి రాగానే 2023-24 ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో రూ.9412 కోట్ల భారం రాష్ట్ర ప్రజలపై మోపారని అన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఏడీఈ శ్యామ్‌సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకురాలు ఎం.శోభారాణి, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు వై.కిశోర్, కేవీ.లక్ష్మణరావు, ఎం.వెంకట్రావు, సీతారామయ్య, వి.ధనమ్మ, కే.నాంచారమ్మ, వై.నవీన్, బి.అగస్టీన్, కె.ఆశీర్వాదం, కె.రమేష్, సుబ్బారావు, పీటర్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర క్రికెట్ ప్రీమియర్ లీగ్ లోగో ఆవిష్కరణ



లోగో ఆవిష్కరిస్తున్న క్రికెట్ టీం మెనేజ్‌మెంట్

వేటపాలెం: క్యాపిటల్ అమరావతి, రాయల్స్ క్రికెట్ జట్టు ఫ్రాంచైజీ యాజమాన్యం స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో జట్టు జెర్సీ లోగోను మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జట్టు కెప్టెన్ హనుమ విహారి హాజరై మాట్లాడుతూ గతంలో జట్టు ఫైనల్ వరకు చేరిందని గుర్తుచేశారు. ఈసారి తప్పకుండా విజయం సాధించి తీరుతామన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. కళాశాల చైర్మన్ వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ నుంచి విశాఖపట్నంలో జరిగే ఆంధ్ర ప్రీమియం లీగ్‌లో ఏడు జట్లు పాల్గొంటాయని తెలిపారు. ఈ పోటీల్లో క్యాపిటల్ అమరావతి రాయల్స్ జట్టు విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జెర్సీ లోగో ఆవిష్కరించారు. జట్టు కోచ్ అబ్రహం, టి.మేనేజర్ హర్ష, సీఈఓ యశ్వంత్, క్రికెట్ అసోసియేషన్ మెంబర్ బి.శ్రీనివాసరావు, కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్.లక్ష్మణరావు, మేనేజర్ ఆర్‌వీ రమణమూర్తి, ప్రిన్సిపాల్ కె.జగదీష్‌బాబు, డైరెక్టర్ సి.సుబ్బారావు పాల్గొన్నారు.

అణు విధ్వంసంపై స్లయిడ్ షోలు

నేడు తెనాలి, చిలుమూరులో ఏర్పాటు

తెనాలి: హిరోషిమా-నాగసాకి దినోత్సవాల సందర్భంగా కోల్‌కతాకు చెందిన ముందడుగు సంస్థ జనసాహితి సహకారంతో స్లయిడ్ షో ఏర్పాటు చేసింది. హిరోషిమా-నాగసాకి పట్టణాల్లో అణువిధ్వంసం జరిగి సరిగ్గా 80 ఏళ్లయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం విశాఖపట్నంలో తొలి స్లయిడ్ షో నిర్వహించారు. బుధవారం తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని వివేక సెంట్రల్ స్కూల్‌లో ఉదయం 10.30 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు చిలుమూరులోని శ్రీరామా రూరల్ కాలేజీలో స్లయిడ్ షోలను నిర్వహిస్తారు. జనసాహితి బాధ్యులు కొత్తపల్లి రవిబాబు ఈ మేరకు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతిచెందిన మిద్దిబోయిన శ్రీనివాసరావు

కర్లపాలెం: గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన కర్లపాలెం మండలం బుద్ధాం గ్రామంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. కర్లపాలెం ఎస్‌ఐ రవీంద్ర తెలిపిన వివరాల మేరకు.. బుద్ధాం గ్రామానికి చెందిన మిద్దిబోయిన శ్రీనివాసరావు(55) పొలం వెళ్లేందుకు జాతీయ రహదారి పక్కన నడిచి వెళుతున్నాడు. గుర్తు తెలియని వాహం ఢీకొనటంతో తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలంలో మృతిచెందాడు.. మృతుని భార్య తిరుపతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతుని భౌతికకాయానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

ఉరి వేసుకొని యువకుడు మృతి

చుండూరు(వేమూరు): ఉరి వేసుకొని ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. చుండూరు మండలం దుండిపాలెం గ్రామానికి చెందిన రవికిరణ్(21) టాపీ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంటిలో ఉరి వేసుకొని మృతి చెందాడు. మానసిక ఒత్తిడికి గురై ఉరి వేసుకొని చనిపోయినట్లు తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారు. సోమవారం కేసు నమోదు చేశారు. మంగళవారం మృతదేహానికి పోస్టుమార్టం చేసి తల్లిదండ్రులకు అప్పగించినట్లు చుండూరు సీఐ శ్రీనివాసరరావు తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

గుంటూరు రూరల్: హాస్టల్‌లో ఉండలేక ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం చేబ్రోలు మండలం శేకూరు గ్రామానికి చెందిన విద్యార్థిని పెదపలకలూరు రోడ్డులోని ఒక కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. రెండు నెలలుగా హాస్టల్‌లో ఉండలేనని, ఇంటికి తీసుకెళ్లాలని తల్లిదండ్రులకు చెబుతోంది. వారు ఆమెకు నచ్చజెప్పి హాస్టల్‌లోనే ఉంచుతున్నారు. మనస్తాపానికి గురైన విద్యార్థిని మంగళవారం హాస్టల్‌లో భవనంపైకి ఎక్కి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులకు కళాశాల యాజమాన్యం సమాచారం అందించారు. విద్యార్థిని తల్లిదండ్రులు గోపయ్య, శాంత కుమారిల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

తెనాలి రూరల్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో సెప్టెంబర్ 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల సివిల్, భరణం, బ్యాంకు దావాలు, మోటారు వాహనాల ప్రమాదాల కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులను ఈ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.


విద్యుత్ సర్దుబాటు పేరుతో దోపిడీ



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు రాయిణి వినోద్‌బాబు

జె.పంగులూరు: విద్యుత్ సర్దుబాటు పేరుతో ప్రభుత్వం వినియోగదారులను నిలువు దోపిడీ చేస్తోందని సీపీఎం సీనియర్ నాయకుడు నాగబోయిన రంగారావు విమర్శించారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను బిగించవద్దని కోరుతూ ప్రజా ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం పంగులూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు ధర్నా చేశారు. రంగారావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పేదలు వెలుగుకు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. స్మార్ట్ మీటర్ల ద్వారా విద్యుత్ చార్జీలు పెరగడమే కాకుండా సెల్‌ఫోన్ రీచార్జ్ మాదిరిగా ముందుగానే డబ్బులు చెల్లించాల్సి వస్తుందన్నారు. ఈపాటికే విద్యుత్ బోర్డును మూడు ముక్కలు చేసి ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారని, ఇప్పుడు ఇళ్లల్లో మీటర్లు కూడా ప్రైవేటు వ్యక్తుల మీటర్లు పెడితే పేదలు బిల్లులు కట్టలేక ఇబ్బందులు పడతారన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు వలన రాబోవు రోజుల్లో అనేక ప్రమాదాలు ఉన్నాయన్నారు. పేదలను పూర్తిగా మోసం చేసి కార్పొరేట్లకు దాసోహం చేస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్లకు ప్రజలంతా ఏకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. సీపీఎం సీనియర్ నాయకులు రాయిణి వినోద్‌బాబు, గుడిపాటి మల్లారెడ్డి, సరికొండ రామచంద్రరాజు, సుబ్బరాజు, వెంకటేశ్వరరాజు, ఆదామ్, సుబ్బారావు, ఇశ్రాయేలు, సుధాకర్, వెంకటేశ్వర్లు, ఇమ్మానియేలు, జాన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఘర్ ఘర్ తిరంగాలో పాల్గొనండి



గుంటూరు మెడికల్: బీజేపీ గుంటూరు జిల్లా విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం మంగళవారం నగరంలోని శ్రీకన్వెన్షన్‌లో జరిగింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ మాట్లాడుతూ అమృత మహోత్సవ్ పేరుతో జాతీయ జెండా పట్టుకొని 13, 14, 15వ తేదీలలో ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయ ప్రకాష్ నారాయణలు మాట్లాడుతూ జిల్లా పార్టీలో సీనియర్ నేతలు, కార్యకర్తలు నేటికీ పార్టీని నడిపిస్తున్నారని చెప్పారు. పి.వి.ఎన్.మాధవ్ గుంటూరు పర్యటన సందర్భంగా మంగళవారం పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి ఘన స్వాగతం పలికాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆధ్వర్యంలో చిల్లీస్ దాబా నుంచి శ్రీ కన్వెన్షన్ హాల్ వరకు ర్యాలీగా వచ్చి స్వాగతించారు. తీన్మార్ డప్పులు, గిరిజన సంప్రదాయ నత్యాలు, పార్టీ జెండాలతో సందడి చేశారు. ద్విచక్ర వాహనాల ర్యాలీ ఆకట్టుకుంది. జిల్లా నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్వారీలో అనుమతికి మించి తవ్వకాలు

క్షతగాత్రులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ విల్సన్



నరసరావుపేటలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులతో మాట్లాడుతున్న విల్సన్

బల్లికురవ: బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ సత్యకృష్ణ గ్రానైట్ క్వారీ అనుమతుల మించి తవ్వకాలు జరిపారని.. భద్రతా చర్యలు పాటించపోవటం వల్లే ఆరుగురి మృతికి ప్రధాన కారణమని.. సమగ్ర విచారణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర నాయకులు జె.విల్సన్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రమాదంలో గాయపడి నరసరావుపేట వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి ప్రమాదానికి కారణమైన క్వారీని పరిశీలించి విలేకర్లతో మాట్లాడారు. పరాయి రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులనే చులకనభావంతో కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్నారన్నారు. ఆదివారం సెలవు అయినా అధికార పార్టీ అండతో 16 మందిని గనుల్లోకి పంపించినట్లు లెక్కలు చెప్పారని.. అయితే ఆరుగురు మాత్రమే చనిపోయారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వాస్తవంగా మృతుల సంఖ్య తేల్చాలని డిమాండ్‌చేశారు. బాధ్యతారాహిత్యంతో కార్మికుల జీవితాలతో చెలగాటమాడిన క్వారీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షలు, గాయపడిన వారికి రూ. 20 లక్షలు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు శింగరకొండ, పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి రాంబాబు, ఏ ఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామేలు, కేఎల్‌డీ ప్రసాద్ నిమ్మల అప్పారావు, శంకర్, పూర్ణచంద్రావు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

మంత్రి గుమ్మడి సంధ్యారాణి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

గుంటూరు వెస్ట్: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, దీని ప్రాధాన్యతను తెలియజేసే లక్ష్యంతో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ సూర్య కుమారిలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన బిడ్డలను కోరుకునే తల్లులు, వారికి పాలు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలకు, పిల్లలకు రూ. కోట్లు ఖర్చు చేసి బాల సంజీవని అందిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,065 తల్లులు పిల్లలకు పాలిచ్చే గదులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం మంత్రి తల్లిపాల ఆవశ్యకతపై ప్రత్యేక పోస్టర్లు ఆవిష్కరించారు. మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్లు పి.ప్రవీణ, ఎం.శిరీష, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి ప్రసూన పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే జీఎం తనిఖీలు



మంగళగిరి రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ్

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మంగళవారం పగిడిపల్లి - గుంటూరు - కృష్ణా కెనాల్ - విజయవాడ సెక్షన్‌లో తనిఖీలు చేపట్టారు. గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ సుధేష్ణ సేన్, విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియా ఆయా ప్రాంతాల్లో పాల్గొన్నారు. ముందుగా జీఎం ఈ సెక్షన్‌లో రియర్ విండో తనిఖీ నిర్వహించారు. సిగ్నలింగ్, రైల్వే ట్రాక్‌ల నిర్వహణ పరిశీలించారు. నల్గొండ రైల్వే స్టేషన్‌లో వెయిటింగ్ హాల్, దివ్యాంగుల టాయిలెట్లు, లిఫ్ట్, తాగు నీటి సౌకర్యం వంటి వాటిపై సమీక్షించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా పునరాభివృద్ధి పనుల పురోగతిని తెలుసుకున్నారు. తర్వాత గుంటూరు పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డివిజనల్ కార్యాలయంలో డివిజనల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గుంటూరులో మొక్కలు నాటే కార్యక్రమంలో అధికారులతో కలిసి పాల్గొన్నారు. తర్వాత మంగళగిరి రైల్వే స్టేషన్‌కు వెళ్లి పరిశీలించారు. భద్రతా మార్గదర్శకాలను పాటించాలని, పనులను గడువు నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.